నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 14 అక్టోబర్ 2024 | HYDERABAD




సికింద్రాబాద్ కీస్ హైస్కూల్ ఆవరణలో భాగ్య సంస్కృతి సాంగ్ బెంగాలీ ఆధ్వర్యంలో అమ్మవారికి బెంగాలీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికి ఒకరు కుంకుమ తిలకం దిద్దుకున్నారు. అలాగే డ్యాన్స్ చేసి మిఠాయిలు తినిపించుకున్నారు.

## గ్రేటర్ @31.7డిగ్రీలు



సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా రాత్రి ఉష్ణోగ్రతల్లో స్వల్ప తగ్గుదల మొదలవడంతో గ్రేటర్ శివారు ప్రాంతాల్లో చలి మొదలైంది. ముఖ్యంగా రాత్రి సమయంలో వాతావరణం చల్లగా ఉంటోంది. నవంబర్ నుంచి చలి పులి పంజా విసిరే అవకాశాలున్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 31.7డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 23.3డిగ్రీలు, గాలిలో తేమ 62 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



# దసరా ముగించుకొని నగరానికి..

**వాహనాలతో కిక్కిరిసిన రహదారులు**

**సిద్దిపేట రూట్‌లో టోల్ ప్లాజా ఎత్తివేత**

సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): దసరా పండుగకు వెళ్లిన నగరవాసులు తిరిగి తమ స్వస్థలాల నుంచి నగరానికి వస్తున్నారు. దీంతో ఆదివారం సాయంత్రం రహదారులు కిక్కిరిసిపోయాయి. సోమవారం నుంచి కార్యాలయాలు తిరిగి ప్రారంభమవుతుండటంతో చాలామంది ఆదివారం తిరిగి నగరానికి చేరుకుంటున్నారు. తెలంగాణ ప్రజలకు దసరా పండుగ ప్రధానమైనది. ఎక్కడున్నా పండుగ రోజు జమ్మి చెట్టు పూజకు చేరుకోవాలని అందరూ తమ స్వగ్రామాలకు చేరుకుంటారు. ఈ సారి పండుగ రెండో శనివారం కావడంతో చాలా మందికి సెలవు పోయింది.. వెంటనే ఆదివారం కావడంతో దసరాకు వచ్చిన రెండు రోజులు పూర్తయ్యాయి. బంధుమిత్రులతో దసరా ఉత్సవాలు తమ స్వస్థలాల్లో జరుపుకొన్న నగర వాసులు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారులపై నగరం నలుమూలల ఉన్న టోల్ ప్లాజాల వద్ద వాహనాల సంఖ్య భారీగా కనిపించింది. ఉత్తర తెలంగాణ నుంచి నగరానికి వచ్చే వారి వాహనాలతో రాజీవ్ రహదారి కిక్కిరిసింది. సుమారు ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచింది. ఈ నేపథ్యంలో సిద్దిపేట జిల్లా దుద్దెడ టోల్ ప్లాజా గేట్లు ఎత్తేశారు. అలాగే మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్, జహీరాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి వచ్చే రోడ్లపై వాహనాల సంఖ్య భారీగా కనిపించింది.

# కన్సల్టెన్సీలతో కాలయాపన

అడ్వైజరీ నియామకాలతో సరిపెడుతున్న హెచ్‌ఎండీఏ

నగరంలో ప్రారంభం కాని ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు

ప్రతిపాదనలకే పరిమితమైన ఎలివేటెడ్ కారిడార్లు, మీరాలం కేబుల్ బ్రిడ్జి



సిటీబ్యూరో, అక్టోబర్ 13(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు తలమానికం కానున్న ఎలివేటెడ్ కారిడార్లు, మీరాలం కేబుల్ బ్రిడ్జిల నిర్మాణంలో హెచ్‌ఎండీఏ కాలయాపన చేస్తున్నది. ప్రాజెక్టుల ఖర్చు, నిర్మాణ వ్యయం, రెవెన్యూ విషయాలను లోతుగా తెలుసుకునేందుకు అధ్యయనం పేరిట జాప్యం చేస్తున్నది. ట్రాన్సాక్షన్ అడ్వైజర్లను నియమించుకుని ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలకే పరిమితం చేస్తోంది. ఇక సలహాలిచ్చే కన్సల్టెన్సీ నివేదికలు వచ్చేంత వరకు ప్రాజెక్టులను అధికారులు మొదలు పెట్టలేకపోతున్నారు. దీంతో ఆ ప్రాజెక్టులు కార్యరూపంలోకి వచ్చేదెప్పుడనేది ప్రశ్నార్థకంగా మారింది.

జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు, ప్యారడైజ్ నుంచి సుచిత్ర డెయిరీ ఫామ్ రోడ్డు వరకు నిర్మించనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్లతో పాటు మీరాలం చెరువుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి హెచ్‌ఎండీఏ ఆరు నెలల కిందట ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో సీఎం రేవంత్ రెడ్డి ఎలివేటెడ్ కారిడార్లకు శంకుస్థాపన కూడా చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. ముఖ్యంగా ప్రాజెక్టులో కీలకమైన భూసేకరణ ఇప్పటికీ మొదలు కాలేదు. డిఫెన్స్ శాఖ ఇచ్చిన క్లియరెన్స్ మేరకు పరిహారం చెల్లించాల్సి ఉండగా... ఇప్పటికీ పరిహారం భూముల అన్వేషణ కొనసాగుతూనే ఉన్నది. అయితే ప్రాజెక్టులపై ఆర్థిక పరమైన అంశాలను అంచనా వేసేందుకు ట్రాన్సాక్షనల్ అడ్వైజరీలను నియమించుకోగా, కన్సల్టెన్సీలు ఇచ్చే నివేదిక ఆధారంగానే హెచ్‌ఎండీఏ ప్రాజెక్టులను పట్టాలెక్కించనుంది.

## అడుగు పడేదెన్నడూ?

16 కిలోమీటర్ల మేర రెండు ప్రధాన మార్గాల్లో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల డిజైన్లు ఇప్పటికే ఖరారైనప్పటికీ... కార్యరూపంలోకి తీసుకొచ్చే విషయంలో హెచ్‌ఎండీఏ తాత్సారం చేస్తున్నది. ప్రధానంగా నిర్మాణ ఖర్చులు, నిర్వహణ భారంపై అవగాహన లేకపోతే ప్రాజెక్టు వ్యయంపై పూర్తి స్పష్టత లేకనే ప్రత్యామ్నాయంగా టీఏలను నియమించుకుంటున్నట్లు తెలుస్తున్నది. ప్యాట్నీ నుంచి తూంకుంట వరకు వెస్ట్ మారేడ్‌పల్లి, కార్ఖానా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట మీదుగా తూంకుంట వరకు ఉండే 11 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను సమగ్రంగా పరిశీలించనుంది. అదేవిధంగా బెంగళూరు హైవే మార్గాన్ని మరింత విస్తరించేలా ఆరులైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి హెచ్‌ఎండీఏ ప్రణాళికలు రూపొందించింది. బెంగళూరు హైవే నుంచి చింతల్‌మెట్ మీదుగా అత్తాపూర్ వరకు 2.65 కిలోమీటర్ల దూరంలో మీరాలం చెరువుపై కేబుల్ బ్రిడ్జిని నిర్మించనున్నది. ట్రాఫిక్ రద్దీ, రవాణా దూరం తగ్గిపోవడంతోపాటు మీరాలం చెరువును చూసేందుకు వీలు ఉండేలా వ్యూ డెక్, స్కై వాక్‌తోపాటు నెహ్రూ జువాలజికల్ పార్క్‌ను చేరుకునేలా డిజైన్ చేశారు. అయితే కొత్తగా చేపట్టిన ఈ ప్రాజెక్టులకు ట్రాన్సాక్షనల్ అడ్వైజర్, ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకే కన్సల్టెన్సీలను హెచ్‌ఎండీఏ మొదటిసారి నియమించింది. ఆ కన్సల్టెన్సీలు ఇచ్చే ఒకవేళ వయబులిటీ లేదని తెలిసే కొన్ని మార్పులు చేస్తూ ప్రతిపాదనలను ఈ ఏజెన్సీలు అందించనున్నాయి. పీపీపీ విధానంలో నిర్మించనున్న ప్రాజెక్టుల విషయంలో ఈ కన్సల్టెన్సీలు ఇచ్చే నివేదికలు కీలకంగా మారినట్లు హెచ్‌ఎండీఏ వర్గాలు వెల్లడించాయి.



# కొత్త కారిడార్‌పై మెట్రో అధికారుల కసరత్తు

ఉత్తర హైదరాబాద్ లక్ష్యంగా

నూతన రూట్‌లను పరిశీలించనున్న అధికారులు

సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): ఔటర్ రింగు రోడ్డును దాటి హైదరాబాద్ మహానగరం విస్తరిస్తున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చొరవతో నగరం నలుదిక్కులా అభివృద్ధి చోటుచేసుకుంది. దాని ఫలితంగానే నివాస గృహాలతో పాటు పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు అన్ని వైపులా ఏర్పాటయ్యాయి. నగర శివారు ప్రాంతాల అభివృద్ధికి అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో రెండో దశను ప్రతిపాదించి డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక)లు రూపొందించినా, అది కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. ప్రధానంగా వెస్ట్, సౌత్, ఈస్ట్ హైదరాబాద్‌ల వైపు కొన్ని మార్గాలను ప్రతిపాదించినా, నార్త్ (ఉత్తర) హైదరాబాద్ వైపు మాత్రం ఒక్క మార్గాన్ని రెండో దశలో ప్రతిపాదించలేదు. దీనిపై గత కొన్ని నెలలుగా పెద్ద ఎత్తున ఉత్తర హైదరాబాద్ ప్రాంతాల వాసులంతా ఒక్కటై ఆందోళనకు సిద్ధం కాగా, వారికి ప్రజా ప్రతినిధులు సైతం మద్దతుగా నిలిచారు. మరోవైపు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ రెండో దశ మెట్రోకు సంబంధించిన 5 మార్గాల్లో సుమారు 76.2 కి.మీ మేర మెట్రోను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు డీపీఆర్‌లను సమర్పించారు.

## కొత్త మార్గాలపై అధ్యయనం...

మెట్రో రెండో దశ మార్గాలు ఖరారైనా, నగరంలో ఇంకా కొన్ని ప్రాంతాలకు మెట్రోను నిర్మించాలన్న డిమాండ్ బాగా పెరగడంతో వాటిని తరువాత దశలో చేపట్టే దిశగా అధ్యయనం చేపట్టనున్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ ప్రాంతం నుంచి ఔటర్ రింగు రోడ్డు వరకు ఉన్న వివిధ ప్రాంతాలను పరిగణలోకి తీసుకొని అధికారులు ఆయా మార్గాలను పరిశీలించనున్నారు. ఇందులో ప్రధానంగా తార్నాక-ఈసీఐఎల్-కీసర, సికింద్రాబాద్ ప్యాట్నీ-అల్వాల్ మీదుగా శామీర్‌పేట, సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి బోయినపల్లి మీదుగా మేడ్చల్ కండ్లకోయ వరకు ఉన్న మార్గాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి ట్రాఫిక్, ప్రయాణికుల రద్దీ వంటి అంశాలపై అధ్యయనం చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న జీహెచ్ఎంసీ పరిధిని ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరిస్తున్న నేపథ్యంలో కోర్ సిటీ నుంచి నగరం నలుమూలలా మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ అధ్యయనాన్ని చేపట్టనున్నట్టు తెలిసింది.

# విద్యార్థుల అభ్యాసనకు ఆరోగ్య ప్రశస్త్..

**విద్యాశాఖ ప్రత్యేక యాప్**



మేడ్చల్, అక్టోబర్13(నమస్తే తెలంగాణ): విద్యార్థుల్లోని మానసిక, శారీరక లోపాలతో పాటు అభ్యాసన లోపాలను గుర్తించేందుకు విద్యాశాఖ ఆరోగ్య ప్రశస్త్ అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉంటేనే అభ్యాసనపై శ్రద్ధగా చదివి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా లోపాలను గుర్తించి బాధిత విద్యార్థులకు సరైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రశస్త్ అనే యాప్‌ను విద్యాశాఖ వినియోగించనుంది. అయితే ఉపాధ్యాయులు తమ దగ్గర చదివే పిల్లలను పరీక్షించి వారిలోని లోపాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నారు. వీటి ఆధారంగా విద్యాధికారులు బాధిత విద్యార్థులకు సరైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే విద్యార్థుల లోపాలను గుర్తించే కార్యక్రమాన్ని విద్యాశాఖ నిర్వహిస్తున్న విషయం విధితమే.

**యాప్‌లో నమోదు చేస్తారు ఇలా..**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్‌లలో చేసుకున్న ప్రత్యేక యాప్ ద్వారా విధులు నిర్వహిస్తున్న పాఠశాల, మొబైల్ నంబర్ ఐడీ తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. ఆ తర్వాత విద్యార్థుల పేర్లు, ఒక్కొక్క విద్యార్థిని పరీక్షించి వివరాలను నమోదు చేస్తారు. ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్‌లో విద్యార్థులకు సంబంధించి 64 ప్రశ్నలు ఉంటాయి. వీటికి సమాధానాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ జవాబుల ఆధారంగా విద్యార్థుల లోపాలను గుర్తిస్తారు. జిల్లాలో ఉన్న పాఠశాలలో వచ్చే నెల నవంబర్ 14 వరకు విద్యార్థుల లోపాలను గుర్తించే కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

**జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు..**

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 1789 ఉండగా 5,35 లక్షల మంది విద్యను అభ్యసిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి మండలానికి ఒక రిసోర్స్ పర్సన్‌ను ఎంపిక చేశారు. రిసోర్స్ పర్సన్‌లకు ఇప్పటికే శిక్షణ పూర్తి చేశారు. రిసోర్స్ పర్సన్‌లు ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన శిక్షణ మేరకు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించగా విద్యార్థుల్లో లోపాలను గుర్తించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు.

# నకిలీ పై ఉక్కుపాదం

ముగ్గురి అరెస్ట్ • రూ. 2 లక్షల విలువైన నకిలీ వస్తువులు స్వాధీనం



సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): అసలు పేరుతో నకిలీ వస్తువులు విక్రయిస్తున్న దుకాణాలపై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి భారీ ఎత్తున వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ సుదీంద్ర కథనం ప్రకారం... రమేశ్‌కుమార్ పరివార్( బేగంబజార్‌లో ఆర్ఎం జనరల్ స్టోర్స్), గోషామహల్‌కు చందిన హితీష్ పవర్ ఫీల్‌ఖానాలో హితీష్ పవర్(శ్రీ సరోజ్ ఏజెన్సీ నిర్వాహకుడు), రాజస్థాన్‌కు చెందిన రమేశ్‌కుమార్ శ్రీ ట్రేడర్స్ పేరుతో ఎర్రగడ్డలో దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ముగ్గురు రాజస్థాన్‌కు చెందిన వాళ్లు కావడంతో.. బేగంబజార్ ప్రాంతంలో జనరల్ ట్రేడింగ్ దుకాణాన్ని నిర్వహించేవారు. అందులో అనుకున్న లాభాలు రాకపోవడంతో అక్రమ దందా చేయాలని నిర్ణయించుకున్నారు. వివిధ కంపెనీల పేరుతో నకిలీ వస్తువులు తయారు చేసి విక్రయించే కాంట్రాక్టులను సంప్రదించారు. గుడ్‌నైట్ లిక్విడ్, కాయిల్స్, గోల్డ్ ఫాష్ కాంబి ప్యాక్, లైజాల్ సర్ఫేస్, క్లీనర్ లిక్విడ్, ఫెవి కిక్ వంటి కంపెనీలకు సంబంధించిన నకిలీ వస్తువులను విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ మూడు దుకాణాలపై దాడులు నిర్వహించి రూ. 2 లక్షల విలువైన నకిలీ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులను అరెస్ట్ చేసి, వారి వద్ద స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి విచారణ నిమిత్తం బేగంబజార్ పోలీసులకు అప్పగించారు.

# దక్షిణ డిస్కంలో.. పూర్తి కాని బదిలీలు



## ఉద్యోగుల ఎదురు చూపులు

సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ కొలిక్కి రావడం లేదు. దసరా పండుగకు ముందు, ఈనెల 7 తర్వాతే పూర్తి చేస్తామని ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన అధికారులు వారం రోజులు గడిచినా బదిలీలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు మొట్టమొదటిసారిగా వెబ్ కౌన్సెలింగ్ తరహాలో బదిలీలకు సంబంధించి జాబితా రూపొందించింది. ఎంతో కాలంగా బదిలీల కోసం ఎదురు చూస్తున్నామంటూ ఉద్యోగులు వాపోతున్నారు. 7వ తేదీ నాటికి ఎంప్లాయీస్ పోర్టల్ ద్వారా ఆప్షన్స్ స్వీకరించిన డిస్కం ఉన్నతాధికారులు, గడువు ముగిసిన వెంటనే బదిలీ జాబితాను వెబ్ కౌన్సెలింగ్ గడువు పూర్తయిన వెంటనే ఆటో రన్ నిర్వహించి జాబితాను ప్రకటించాల్సి ఉంది. అయినా ఈ విషయంలో స్పష్టత లేదు. ఎంతో పారదర్శకంగా చేస్తున్నామని చెప్పిన డిస్కం ఉన్నతాధికారులు, మార్గదర్శకాలు, గడువు విషయాలను పట్టించుకోకుండా బదిలీల జాబితా విడుదల చేయడంలో తాత్సారం చేస్తుండటంతో ఉద్యోగులు మండిపడుతున్నారు.

**ఉద్యోగుల బదిలీలు ఇలా...**

| | |
|---|---|
| డివిజనల్ ఇంజినీర్లు(డీఈ) | -111 |
| అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు | - 263 |
| అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు | - 521 |
| ఇతర కేడర్ ఉద్యోగులు - | 231 |